సజావుగా సమగ్ర కుటుంబ సర్వే

కలెక్టర్ వల్లూరు క్రాంతి

చౌటకూర్‌లో సర్వేని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

చౌటకూర్, నవంబర్ 15 : సమగ్ర కుటుంబ సర్వే సజావుగా సాగుతున్నదని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. మండల కేంద్రం చౌటకూర్‌తో పాటు కోర్పోలులో శుక్రవారం ఆమె సందర్శించారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ, కుల సర్వే సాఫీగా కొనసాగుతుందన్నారు. సర్వేకు సంబంధించి ఎన్యూమరేటర్లకు ప్రత్యేకంగా శిక్షణ, అవగాహన కల్పించడంతో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా నిర్ణీత ఫారాల్లో కుటుంబ వివరాలను నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఇంటింటి సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరిస్తున్న తీరును, నిర్ణీత ఫారాల్లో ఆయా కోడ్‌ల వారీగా వివరాలు నమోదు చేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. సర్వేను వేగవంతం చేయాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. ఆయా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ధాన్యం సేకరణలో వేగం పెంచాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు.

కల్లాలు ఏర్పాటు చేసుకోవాలి

రైతులు వారీగా ధాన్యం కొనుగోలు, బిల్లులు చెల్లింపు వివరాలతో కూడిన రిజిస్టర్లు ట్రక్ షీట్లను కలెక్టర్ తనిఖీ చేశారు. 161 జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై ఆరబెట్టిన వరి ధాన్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఎండబెట్టిన ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టవద్దని, కల్లాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారి బాలరాజు, తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్, ఎంపీఈవో శ్రీకాంత్‌గౌడ్, ఏవో ప్రవీణ, పంచాయతీ కార్యదర్శులు సందీప్‌గౌడ్, మల్లేశం, డీసీఎంఎస్ సూపర్ వైజర్ వంశీగౌడ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన ఎంపీడీవో

కంగ్టి, నవంబర్ 15 : మండలంలోని తుర్కవడగామ, ఎన్కెమూరి గ్రామాల్లో కొనసాగుతున్న కులగణన సర్వేను కంగ్టి ఎంపీడీవో సత్తయ్య పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబంలోని వివరాలను సేకరించాలని ఎన్యూమేటర్లకు సూచించారు. 72 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను క్లుప్తంగా కుటుంబసభ్యులతో అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఎంపీవో సుభాశ్, తదితరులు పాల్గొన్నారు.

తగిన ధర చెల్లించాలి

జహీరాబాద్ మండలంలో పత్తి తెంపడాన్ని నిలిపేసిన ఆంధ్ర కూలీలు

నిరసనలో ఆంధ్ర కూలీలు

జహీరాబాద్, నవంబర్ 15 : పత్తి తెంపేందుకు తగినధర చెల్లిస్తేనే పొలాలకు వస్తామని ఆంధ్ర కూలీలు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌తో పాటు పలు గ్రామాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్, అదోని తదితర ప్రాంతాలకు చెందిన కూలీలు పత్తి తెంపడాన్ని నిలిపివేశారు. ఊరు గానీ ఊరు నుంచి బతుకుదేరువు కోసం పిల్లాపాపలతో పత్తి తెంపేందుకు వలస వచ్చామని కూలీలు వాపోయారు. పత్తి తెంపేందుకు చెల్లిస్తున్న కూలీతో కుటుంబాలను పోషించుకోవడానికి ఇబ్బందిగా మారిందన్నారు. ప్రస్తుతం పత్తి తెంపడానికి కిలోకు రూ. 10 చెల్లిస్తున్నారని, దీంతో రోజువారికి కూలీ రూ. 500 వస్తున్నాయని పేర్కొన్నారు. పత్తి కిలోకు రూ. 12 వరకు కూలీ చెల్లిస్తే గిట్టుబాటు అవుతుందన్నారు. పత్తి తెంపడానికి కూలీ చెల్లింపు విషయంలో చర్చించి చెబుతామని రైతులంటున్నారు.

సమ్మెతో దిగివచ్చిన అధికారులు

పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు అంగీకారం..

సమ్మె చేస్తున్న కాంట్రాక్టు కార్మికులతో మట్లాడుతున్న జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఉమమహేశ్వర్‌రావు

జహీరాబాద్‌హ నవంబర్ 15 : కొన్ని రోజులుగా జహీరాబాద్ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న ధర్నా, సమ్మెతో సంబంధిత శాఖాధికారులు దిగివచ్చారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వర్‌రావు, సీఐటీయూ నాయకులు, కార్మికుల సమస్యలతో చర్చించారు. కార్మికులకు చెల్లించాల్సిన ఫీఎస్, ఈఎస్ఐ బిల్లులు, పీఎఫ్ విత్‌డ్రాలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని సంబంధిత శాఖాధికారులు లిఖిత పూర్వక హామీతో కార్మికులు సమ్మెను విరమించారు. ఆనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి, సహాయ కార్యదర్శి సాయిలు, మహిపాల్ మాట్లాడుతూ కలిసికట్టుగా పోరాటం చేస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. నాయకులు యశోదమ్మ, పున్యమ్మ, సంజీవ్, మోహన్, నరేశ్, గుండు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లో చేప పిల్లలు విడుదల

పోసానిపల్లి పెద్ద చెరువులో చేప పిల్లలను వదులుతున్న మత్స్యకారులు

చౌటకూర్, నవంబర్ 15 : మండలంలోని వివిధ గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో శుక్రవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో లక్షా 81 వేలు చేప పిల్లలను విడుదల చేశారు. కోర్పోలులోని మల్కా చెరువులో 19 వేలు, పటేల్ చెరువులో 37 వేలు, సుల్తాన్‌పూర్‌లోని పెద్ద చెరువులో 30 వేలు, పోసానిపల్లిలోని పెద్ద చెరువులో 30 వేలు, చౌటకూర్‌లోని నాయిని చెరువులో 30 వేలు, కోమటి చెరువులో 35 వేలు చేప పిల్లలను వదిలినట్లు మత్స్య శాఖ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీశైలం, ఫిషర్‌మెన్ కనకయ్య తెలిపారు. మత్స్య సహకార సంఘం అధ్యక్షుడునర్సింహులు, నాయకులు రాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై చైర్ పర్సన్ ఆరా

బీరప్ప బస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న చైర్ పర్సన్ రోజా బాల్ రెడ్డి

బొల్లారం, నవంబర్ 15 : మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు బీరప్ప బస్తీలో నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులపై చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి ఆరా తీశారు. శుక్రవారం బస్తీలో పర్యటించి నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం స్థానికుల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని తెలిపారు. బస్తీలో చేపడుతున్న అభివృద్ధి పనులను కౌన్సిలర్ చంద్రారెడ్డి పర్యవేక్షించారు. మాజీ వార్డు సభ్యురాలు శారద, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

జిన్నారం : అయ్యప్ప ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

సంగారెడ్డి : తాళ్లపల్లిలోని మల్లికార్జున స్వామి దేవాలయంలో కార్తికపౌర్ణమి సందర్భంగా కుటుంబ సమేతంగా పూజలు చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర

ఆలయాలకు 'కార్తిక' శోభ

కార్తిక పౌర్ణమి సందర్భంగా సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో భక్తుల సందడి నెలకొన్నది. శుక్రవారం ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. వివిధ ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు చేసి, దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శివనామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి.

సంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, నవంబర్ 15

చౌటకూర్ : అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వరాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ సర్పంచ్ జనార్దన్ దంపతులు

గుమ్మడిదల : వీరభద్రస్వామి ఆలయంలో కార్తిక దీపోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

భక్తులతో సందడిగా మంజీర తీరం

జహీరాబాద్ : రాఘవపూర్ గ్రామ శివారులోని మంజీర నదిలో పుణ్యస్నానాలను అచరిస్తున్న భక్తులు

జహీరాబాద్, నవంబర్ 15 : గలగల పారుతున్న మంజీర నది పరవళ్లలో భక్తుల చన్నీటి స్నానాలు.. ఆలయాల్లో ప్రత్యేక పూజలతో జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం కార్తిక సందడి నెలకొన్నది. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని రాఘవపూర్ సరస్వతీ దేవి పంచవటీ క్షేత్రంలో సమీపంలోని మంజీర నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం మహిళలు గోదారమ్మకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలతో దీపాలను వెలిగించి మంజీర నదిలో వదిపెట్టారు. అనంతరం సిద్ధి సరస్వతీ పంచవటీ క్షేత్రంలో పీఠాధిపతి కాశీనాథ్ బాబా ఆధ్వర్యంలో సరస్వతీ దేవి, సాయిబాబా, జ్యోతిర్లింగాలు, భూ దేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి, సూర్యభగవాన్ ఆలయాలల్లో వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ, కర్ణాటకలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక బ్యారికేడ్ల గుండా వెళ్లి ఆయా ఆలయాల్లో పూజలు చేసి దర్శించుకున్నారు.

కేతకీలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం

ఝరాసంగం, నవంబర్ 15 : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం పార్వతీ సమేత సంగమేశ్వరాలయంలో శుక్రవారం భక్తుల కోలాహలం మధ్య కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు. ఆలయ ఆవరణలోని అమృత గుండంలో దీపారాధన, గంగాహారతిని నిర్వహించారు. కల్యాణంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శశిధర్, అలయ అర్చకుల బృందం, అలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామలింగేశ్వరాలయంలో మంత్రి పూజలు

సదాశివపేట, నవంబర్ 15 : కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం మండల పరిధిలోని నందికందిలో గల పురాతన రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజ లు చేశారు. ముందుగా అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శివలింగానికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తిక దీపాలు వెలిగించారు.

సదాశివపేట : రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి కొండా సురేఖ

రామచంద్రాపురం: భెల్ ఆలయ ఆవరణంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

దీపం వెలిగిస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

కోహీర్ : బడంపేట రాచన్నస్వామి దేవాలయంలో కార్తిక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

గ్రూప్-3 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 15 : టీజీపీఎస్‌సీ గ్రూప్-3 పరీక్షలు ఈ నెల 17, 18 తేదీల్లో జరగనున్నాయి. ఈ మేరకు జిల్లా యంత్రాంగం పరీక్షలను ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసి టీజీపీఎస్‌సీ గ్రూప్-3 పరీక్షల నిర్వహణపై దిశా నిర్దేశం చేసిన విషయం తెలిసిందే. పరీక్షల నిర్వహణకు జిల్లాలో మొత్తం 49 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 9 రూట్లుగా విభజించి ఒక్కో రూట్‌కు ఒక్కో జాయింట్ రూట్ ఆఫీసర్‌ను నియమించారు. 119 మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, 157 మంది గుర్తింపు అధికారులు, 15 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు. ఇతర సిబ్బంది 34 మందిని నియమించారు. ఈ నెల 17న మొదటి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1 (జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీ), సాయంత్రం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు పేపర్-2(హిస్టరీ, పొలిటికల్ అండ్ సొసైటీ) పరీక్ష నిర్వహించనుండగా, 18న రెండో రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-3 (ఎకనామిక్ అండ్ డెవలప్‌మెంట్) పరీక్షలు జరగనున్నాయి. అభ్యర్థులు ఉదయం 8.30 గంటల వరకే చేరుకోవాల్సి ఉంటుంది. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

'బిర్సా'కు ఘన నివాళి

బిర్సా ముండా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 15 : గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు ప్రభుత్వ పథకాలను అమలు పర్చాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ధర్తీ ఆబ భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై.. బిర్సా ముండా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రచారం కల్పించాలన్నారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అఖిలేశ్ రెడ్డి, సిబ్బంది, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కంది సెంట్రల్ జైల్ వద్ద బీఆర్ఎస్ నేతల నిరసన

కంది సెంట్రల్ జైల్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కంది, నవంబర్15 : కాంగ్రెస్ ప్రభుత్వ ఆరాచక పాలన, అక్రమ అరెస్టులను వ్యతిరేఖిస్తూ బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం కంది సెంట్రల్ జైల్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. అరెస్టు చేసిన వారందరినీ విడుదల చేయాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కంది సెంట్రల్ జైల్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తున్న సందర్భంగా పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి కొంత మంది ముఖ్య నాయకులనే లోపలికి అనుమతించారు. నాయకులు, కార్యకర్తలపై కక్షపూరితం వ్యవహరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం తప్పదన్నారు. కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. లగచర్ల రైతులకు బీఆర్ఎస్‌అండగా ఉంటుందన్నారు.

మంబాపూర్‌కు రవాణా సౌకర్యం కల్పించాలి

రవాణా సౌకర్యం కల్పించాలని బీఆర్ఎస్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డిని కోరుతున్న గ్రామస్తులు

గుమ్మడిదల, నవంబర్ 15 : పేద విద్యార్థుల చదువుకు గ్రామానికి రవాణా సౌకర్యం కల్పించాలని మంబాపూర్ గ్రామస్తులు శుక్రవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డిని కోరారు. మంబాపూర్‌లో ప్రాథమిక పాఠశాల మాత్రమే ఉండడంతో నిరుపేద విద్యార్థులు కేవలం ఐదో తరగతి వరకే చదువుకుంటున్నారని, పైతరగతులు చదవాలంటే గుమ్మడిదలకు వెళ్లాల్సి ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. మంబాపూర్ గ్రామం నుంచి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం నుంచి పాఠశాలకు ప్రతి రోజు వచ్చి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. స్పందించిన ఆయన విద్యార్థుల కోసం త్వరలోనే ప్రత్యేకంగా ఆటో సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ కంజర్ల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ దయానంద్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రకాశ్, నాయకులు దయానంద్, లక్ష్మణ్, రాజు, నాగరాజు, సాయి, ఎల్లయ్య పాల్గొన్నారు.

న్యాల్‌కల్ మండలం రాఘవపూర్ సిద్ధిసరస్వతీదేవి పంచవటీ క్షేత్రంలో వెలిగించిన కార్తిక దీపాలు

ఇంటింటా నోములు, వ్రతాలు

అమీన్‌పూర్ : బీరంగూడ మల్లికార్జున స్వామి ఆలయంలో అన్నదానం

అమీన్‌పూర్ నవంబర్ 15 : అమీన్‌పూర్ మున్సిపల్ మండల పరిధిలోని ప్రజలు శుక్రవారం ఘనంగా కార్తిక పౌర్ణమి పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి బీరంగూడ మల్లికార్జున స్వామి ఆలయం పరిసర ప్రాంతాలు దీపోత్సవాలతో పౌర్ణమి పూజలు భారీ ఎత్తున నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ నరసింహ గౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమీన్‌పూర్ పట్టణ ప్రజలు ఇంటింటా నోములు, సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి,స్థానిక నేతలు పాల్గొన్నారు.

అమీన్‌పూర్ : బీఆర్ఎస్ కౌన్సిలర్ మల్లేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హోమంలో పాల్గొన్న నేతలు

కాల్వలను నిర్మించాలి

కోహీర్, నవంబర్ 15 : తమ ఇండ్లలో వినియోగించిన నీటిని గ్రామం బయటకు పంపించేందుకు మురుగు కాల్వలను నిర్మించాలని స్థానికులు కోరారు. శుక్రవారం మండల ప్రత్యేకాధికారి నర్సింహరావు చింతల్‌ఘాట్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మురుగు బయటకు వెళ్లేందుకు సరిపడా కాల్వలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు నిలిచి ఉండడంతో దోమల బెడద అధికమయ్యిందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం చింతల్‌ఘాట్‌తో పాటు కొత్తూర్(డి), దిగ్వాల్ గ్రామాల్లో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు.

కుక్కల దాడిలో 16 మేక పిల్లలు మృతి

కంగ్టి, నవంబర్ 15 : కుక్కల బెడద గ్రామాల్లో అధికమైందని గ్రామస్తులు వాపోతున్నారు. శుక్రవారం కంగ్టి మండలం దెగుల్‌వాడిలో మేకపిల్లలపై దాడి చేశాయి. దీంతో ఉప్పరి రాంచందర్‌కు చెందిన16 మేక పిల్లలు మృతి చెందాయి. గ్రామంలో కుక్కల బెడద అధికమైందని పలుమార్లు సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి మేకలపైనే జీవనాధార మైన రాంచందర్‌ను ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు ఇండియా కే12 అవార్డు

బొల్లారం, నవంబర్ 15 : బొల్లారం మున్సిపల్ పరిధిలోని జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు ఎల్రాక్ ఇండియాకే 12 అవార్డును నిర్వాహకులు అందజేశారు. ఈ మేరకు నగరంలో నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ కో ఫౌండర్ స్మిత భోగరాజు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌కు సంస్థ నిర్వాహకులు అవార్డులను అందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సతీశ్ కుమార్ కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

అయ్యప్పస్వాముల పాదయాత్ర

పాదయాత్రగా వెళ్తున్న స్వాములు

జిన్నారం, నవంబర్ 15 : ఊట్ల గ్రామంలోని అయ్యప్ప స్వాములు కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని పాదయాత్ర చేశారు. ఊట్ల అయ్యప్ప ఆలయం నుంచి బొంతపల్లి అయ్యప్ప దేవస్థానం వరకు ఎనిమిది కిలోమీటర్లు పాదయాత్రగా వెళ్లారు. పూజా కార్యక్రమాల అనంతరం జింకల మధుగురుస్వామి ఆధ్వర్యంలో సుమారు 20 మంది స్వాములు ఉదయం బయలుదేరి మధ్యాహ్నానానికి తిరిగి సన్నిదానానికి వచ్చారు.

ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతులు ప్రారంభం

పనులు పరిశీలిస్తున్న అధికారులు

జిన్నారం, నవంబర్ 15 : కంకర క్రషర్ల నుంచి అధికలోడుతో వెళ్తున్న టిప్పర్లతో మాదారం గ్రామం నుంచి రింగురోడ్డు వరకు ఏర్పడిన గుంతలను ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. కంకర క్రషర్ యాజమాన్యాలతో మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ చర్చించి రోడ్డును మరమ్మతులు చేయించేందుకు ఒప్పించారు. శుక్రవారం ప్రారంభమైన మరమ్మతు పనులను ఆర్అండ్‌బీ ఏఈ చంద్రశేఖర్ గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గణేశ్, మాజీ ఉపసర్పంచ్ మల్లేశ్, నాయకులు సుధాకర్ గౌడ్, శ్రీనివాస్, నరసింహాగౌడ్, రామకృష్ణగౌడ్, శంకర్, బల రాం, పాండుయాదవ్, రాజు పాల్గొన్నారు.

తల్లీ కొడుకు హత్య దారుణం

ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్‌రెడ్డి

గుమ్మడిదల, నవంబర్ 15 : తల్లీ కొడుకు హత్య దారుణమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గుమ్మడిదల మండల పరిధిలోని బొంతపల్లి వీరభద్రనగర్ కాలనీలో చోటుచేసుకున్న తల్లీ కొడుకు హత్యపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు తగిన చర్య లు తీసుకోవాలని కోరారు. అంత్యక్రియల ఖర్చు కోసం రూ. 20 వేలు అందజేశారు.